సినిమా అనే మూడక్షరాల అద్భుతం తన ప్రస్థానాన్ని ప్రారంభించింది షార్ట్ ఫిల్మ్ గానే! సినిమాలు నిర్మించడం ఒక పరిశ్రమగా రూపాంతరం చెందిన తర్వాతే రెండు గంటల పైన నిడివి ఉండే సినిమాలు తీయడం మొదలైంది. పాశ్చాత్య దేశాలలో పెద్ద సినిమాలతో పాటు షార్ట్ ఫిల్మ్‌లు తీయడం కూడా కొనసాగుతూనే ఉంది కాని మనదేశంలో మాత్రం ఈ ట్రెండ్ ఊపందుకొంది గత పది పదిహేనేళ్ల నుండే. ఇది ఇంకా పూర్తి స్థాయి పరిశ్రమగా ఎదగలేదు. ఎక్కువ శాతం చిత్రాలు ప్రజలెదుర్కొంటున్న సమస్యలపైనే ఉంటున్నాయి.

ఫెస్టివల్ డైరెక్టర్ దివాకర్ బాబు మాటల్లో చెప్పాలంటే...''షార్ట్ ఫిల్మ్‌లని సూక్ష్మంలో మోక్షం అని ఒక్క వాక్యంలో చెప్పొచ్చు. ఇప్పటివరకు మాకు అందిన సినిమాల్లో ఎక్కువగా కనిపించిన అంశాలు సమాజం ఎదుర్కొంటున్న సమస్యలే. ఉద్యోగులపై ఆర్థికమాంద్యం ప్రభావం, క్యాన్సర్ పేషెంట్ జీవితం, ప్రేమ, ఎయిడ్స్ మొదలైన అనేక విషయాల గురించి దర్శకులు స్పందించిన తీరుని మనం ఈ సినిమాల్లో చూడవచ్చు. ఈ అంశాల్లో కొన్నిటిపై మెయిన్‌స్ట్రీమ్ సినిమాలు వచ్చాయి కాని కొన్నిటి మీద మాత్రం అసలు రాలేదు. చెప్పాలనుకున్న దాన్ని సూటిగా చెప్పే స్వేచ్ఛ షార్ట్ ఫిల్మ్ మేకర్‌కే ఎక్కువ. సమాజం గురించి మరి కాస్త ముందుకెళ్లి ఆలోచిస్తున్నారు కాబట్టే వాళ్లా సినిమాలు తీస్తున్నారనిపిస్తుంది. ఉత్తమ సమాజం ఏర్పడాలనే ఒక ఆకాంక్ష ఆ సినిమాల్లో కనిపిస్తుంది.''

అవార్డుల కోసమే ఈ సినిమాలు తీస్తారనే వాళ్లు కూడా ఉన్నారు. అయితే అలాంటి వారు ఏ కొందరో ఉంటారని అంటారు దివాకర్ బాబు. ''మేం ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని ప్రకటన ఇచ్చిననాటి నుండి ఇప్పటికి 120 కి పైగా ఎంట్రీలు వచ్చాయి. అవన్నీ ఈ ఫెస్టివల్ కోసం తీసినవని అనలేం. ఎందుకంటే వాటిలో చాలా సినిమాలు ఇప్పుడు తీసినవి కావు. రచయిత అయినా, షార్ట్ ఫిల్మ్ మేకర్ అయినా తమ కెరీర్ మొదట్లో తన చుట్టూ ఉన్న ప్రపంచం, తాను గమనిస్తున్న వాటికి స్పందనగానే రచనలు, సినిమాలు తీస్తాడు. అందుకే ఈ సినిమాల్లో సామాజిక అంశాలు ఎక్కువగా ఉంటాయి'' అని ఆయన వివరించారు. సమస్యలు ఎప్పుడూ ఉన్నవే, ఉండేవే. అయితే గత కొన్నేళ్లనుండే ఈ సినిమాలెందుకొస్తున్నాయంటే...

## అందుబాటులో టెక్నాలజీ

టెక్నాలజీ సినిమాకి అయ్యే ఖర్చుని భారీగా తగ్గించేసింది. దాని ప్రభావమే ఈ సినిమాలన్నీ. ఒకప్పుడు ఏ సినిమా అయినా రీల్ మీదే తియ్యాల్సి వచ్చేది. ఇప్పుడు అలా కాదు. వీడియో కెమేరాలు, డిజిటల్ కెమేరాలు చవకగా అందుబాటులోకి వచ్చేశాయి. ఇదే ఇప్పుడు ఎంతో మంది షార్ట్ ఫిల్మ్ మేకర్స్‌ని తయారు చేసింది. అందుకే షార్ట్ ఫిల్మ్‌లని వీడియో ఫిల్మ్‌లు అని కూడా అంటుంటారు.





దివాకర్‌బాబు, ఫెస్టివల్ డైరెక్టర్ శ్రీచైతన్య, ఫెస్టివల్ కన్వీనర్

వీడియో చిత్రాల్లో నటించే వాళ్లందరూ ప్రొఫెషనల్ యాక్టర్లు కాదు. ''వాళ్లంతా సినిమా తీసేవాళ్ల స్నేహితులో, నటించాలనే కోరిక ఉన్న వాళ్లో అయి ఉంటారు. కాబట్టి వాళ్లు డబ్బులు తీసుకోకుండానే నటిస్తారు. కథ రాసుకోగలిగితే చాలు, ఖర్చంతా కెమేరాకి, ఎడిటింగ్‌కే. ఎక్కువ శాతం సినిమాలకి బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కూడా ఒరిజినల్‌గా రికార్డ్ చేయరు. అందుకే ఇప్పుడు 20 నిమిషాల సినిమా 25 వేల రూపాయల్లో పూర్తి చేయవచ్చు. క్వాలిటీ విషయంలో వీటిని మెయిన్ స్ట్రీమ్ సినిమాలతో పోల్చడం సరికాదు. షార్ట్ ఫిల్మ్ గొప్పతనమంతా స్క్రిప్ట్ లోనే ఉంటుంద''ని అంటాడు కమల్ అనే షార్ట్ ఫిల్మ్ మేకర్.

తమ పని తాము చేసుకుంటూనే అప్పుడప్పుడూ సినిమాలు చేస్తుంటారు ఈ ఫిల్మ్ మేకర్స్. ''ఒక ప్రైవేటు రేడియో స్టేషన్‌లో పని చేస్తున్న నేను సినిమాలు తీయాలనే కోరిక తోటే వీడియో కెమేరా కొనుక్కున్నాను. ఇప్పటికి ఆరు సినిమాలు చేశాను. వాటిలో రెండింటికి జాతీయ స్థాయి అవార్డులు కూడా వచ్చాయి. హైదరాబాద్‌లో జరగబోయే ఫెస్టివల్‌కి రెండు సినిమాలు పంపాను. ఒకటి 'ఐ హావ్ క్యాన్సర్', రెండోది 'యువర్స్ మీ'. ఈ రెండూ నిజ జీవితంలో జరిగిన సంఘటనల నుండి తీసుకొని సినిమాలుగా తీసినవే. ఆ సంఘటనల గురించి తెలిసినప్పుడు నాలో కలిగిన వేదనని నేను సినిమా రూపంలో వ్యక్తపరిచాను'' అని కమల్ అన్నాడు. సినిమా పరిశ్రమలోకి అడుగు పెట్టాలనుకుంటున్న మరో వ్యక్తి శ్రీనివాస్.

## అవకాశాల కోసం...

ఇంటర్మీడియట్ అవగానే సినిమాల్లో అవకాశాల కోసం హైదరాబాద్ వచ్చిన శ్రీనివాస్‌ది విజయనగరం జిల్లా గుణుపూర్. ఇప్పటికి పదికి పైగా లఘు చిత్రాలు తీసిన శ్రీనివాస్ రెండు సినిమాల్ని హైదరాబాద్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీలకి పంపించాడు. 'ప్లాట్ నంబర్ 101' అనే సినిమాకి గాను గతంలో అతడికి బెస్ట్ డైరెక్టర్ అవార్డు లభించింది. ఇండియా రాక్స్ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో శ్రీనివాస్‌కి ఆ అవార్డు లభించింది. అంతే కాదు అతను కోరుకున్న సినిమా ఆఫర్ కూడా అతనికి వచ్చింది.

''నేను చేసే ప్రతి సినిమాలో నా టాలెంట్‌ని నిరూపించుకోవడంతో పాటుగా ఎంతో కొంత సందేశం ఉండేలా సినిమాలు తీస్తుంటాను. నా సినిమాలన్నింటిలో కనిపించేదదే. ఈ ఫెస్టివల్‌కి నేను పంపించిన సినిమాలు 'బ్రేక్ ద సైలెన్స్', 'పింక్ స్లిప్'. మొదటి దాంట్లో ఎయిడ్స్ గురించిన అపోహల్ని తొలగిపోవాలనే సందేశం ఉంటుంది. సాఫ్ట్ వేర్ ఉద్యోగులకి 'పింక్ స్లిప్' గురించి బాగా తెలుసు. అది అందిందంటే ఉద్యోగం ఊడిందన్న మాటే. ఆర్థిక మాంద్యం వారిపై ఎలాంటి ప్రభావం చూపిందో తెలియజేసేదే ఆ సినిమా. ఫెస్టివల్స్ నిర్వహించడం వల్ల మాకు ఎంతో కొంత మేలు జరుగుతుంది. మా టాలెంట్‌ని నిరూపించుకునే అవకాశం అక్కడ తప్ప మరెక్కడా రాదు కాబట్టే నేను ఈ ఎంట్రీలను పంపాను'' అని వివరించాడు.



పాండ్రంకి శ్రీనివాస్ (తెల్ల టీషర్ట్)... 'బ్రేక్ ది సైలెన్స్' సినిమా తీస్తూ...